క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న సాయిబాబా

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద గల మహాత్మగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా సాయి విగ్రహానికి పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం విభూదితో అభిషేకించారు. స్వామి మందిరం చుట్టూ వెయ్యి ఒక్కటి దీపాలను, వివిధ రకాల పుష్పాలను అలంకరించి భజనలను చేశారు. సాయంతం స్వామిని పల్లకి ఊరేగించారు. మధ్యాహ్నం పలువురు భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు.

ప్రజలకు చెంతకు వైద్యసేవలు

విశాఖ విద్య: ప్రజల చెంతకు వైద్యసేవలు విస్తరించాలనే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ప్రత్యేక శిబిరాల నిర్వహణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీను అన్నారు. 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం చైతన్య కాలేజీలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసర కాలనీలకు చెందిన ప్రజలు వైద్య సేవలు పొందారు. ప్రభుత్వ వైద్య నిపుణులతో పాటు, ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులు సైతం సేవలు అందించారు. సాధారణ వ్యాధులతో పాటు, కంటి, దంత పరీక్షలు ఎక్కువ మంది చేయించుకున్నారు. వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేశారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజనం అందించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్లను అదుపులో తీసుకున్నారు. వీరి నుంచి రూ 40,270 స్వాధీనం చేసుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా దుర్గాదేవి పూజలు



దుర్గాదేవికి పూజలు చేస్తున్న కార్పొరేటర్లు సుధ, గుండపు నాగేశ్వరరావు

మల్కాపురం : దుర్గాదేవి శరన్నవరాత్రులు సందర్భంగా 61వ వార్డు మల్కాపురం, మార్కెట్ లేన్‌వద్ద శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధతో పాటు, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొని దుర్గమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సేవా సంఘం ప్రతినిధులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో ఎన్నికల సందడి

సింధియా : హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల సందడి ప్రారంభమైంది.ఈ మేరకు శుక్రవారం ఓటరు జాబితాను ఎన్నికల రిటైనింగ్ అధికారి ప్రకటించనుండగా, శనివారం ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. నవంబర్ 7న తుది జాబితా ప్రకటించనున్నారు. 8వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తారు. 9న నామినేషన్ల ఉపసంహరణతో పాటు ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నారు. 18వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు విజేతలను ప్రకటిస్తారు.

పేదలకు వరం..'జగనన్న ఆరోగ్య సురక్ష'



ఆరోగ్య పరీక్షల కోసం వేచి ఉన్న స్థానికులు



మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గోపాలపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం లక్ష్మీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వ్యాధిగ్రస్తులను వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యురాలు బి.పూజ పర్యవేక్షణలో 483 సచివాలయ పరిధిలో సుమారు 200మంది వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 10 గంటలకు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. డెంటల్, కంటి వైద్యులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ వైద్యనిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్షయ వ్యాధి విభాగం సిబ్బంది ప్రత్యేక కౌంటర్ ద్వారా రోగులకు సేవలు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, ఊటపల్లి గోవిందు, కాళ్ల వీర్రాజు, జీవీ రమణ, భారతీ ప్రసాద్, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న డాక్టర్

నేడు 40వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. ప్రజలకు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

గోతుల పూడ్చివేత



సేవా మార్గంలో పనులను పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శనరావు

మల్కాపురం : కోరమాండల్ నుంచి సింధియా వరకు గల సేవా మార్గంలో పలు చోట్ల ఏర్పడిన గోతులను మల్కాపురం ట్రాఫిక్ అధికారులు దగ్గరుండి గురువారం కప్పించారు. ఇక్కడ సేవా మార్గాంలో ఇరువైపులా పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ మార్గాన రాకపోకలు సాగించే పలువురు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా పలు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో స్పందించిన ట్రాఫిక్ అధికారులు పలు చోట్ల గోతులను కప్పించారు. పనులను ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శనరావు దగ్గరుంచి పర్యవేక్షించారు.

ఓపెన్ హౌస్‌తో అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ బాబు

మల్కాపురం: జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు పోలీస్ విధి,విధానాలపై ఓపెన్ హౌస్ ద్వారా అవగహన కల్పించారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మల్కాపురం స్టేషన్ వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో సీఐ జి.డి.బాబు పోలీసు సేవలను విద్యార్థులకు వివరించారు. ఏవరైనా చులకనగా ప్రవర్తిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి, ఎలా ఫిర్యాదు చేయాలి, ఆ సమయంలో ఎలా సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్న అంశాలను వివరించారు కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, ఏఎస్ఐ ఎం.ఎం.నాయుడు, శంకర్ పాల్గొన్నారు.

పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 987వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్రప్రభుత్వ పెద్దలు దేశంలోని ప్రజాసమస్యలను వదిలిపెట్టి తమ రాజకీయ అవసరాల కోసమే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీల కుట్ర రాజకీయాలను వ్యతిరేకించాల్సిన ప్రతిపక్ష పార్టీలు వారికి వంతపాడుతున్నాయన్నారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్



నిరుపయోగంగా బోరు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం పరిధి సాయిబాబా ఆలయ ఆవరణలో 3/56 బోరు నిరుపయోగంగా ఉంది. బోరుకు చుట్టూ గట్టు లేకపోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. బోరును గతంలో పాదచారుల, స్థానికులు వినియోగించేవారు. మంచి నీటి బోరు నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు. ప్రస్తుతం తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోరుకు మరమ్మతులు చేయాలి.

-ఎస్.సాయికిరణ్, గవర కంచరపాలెం.

మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాల తొలగింపు



మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాన్ని తొలగిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ జోన్-3 అధికారుల పర్యవేక్షణలో మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. కొద్ది రోజులుగా ట్రాఫిక్‌కు పాటు నగర అభివృద్ధి ప్రాజెక్టులకు ఇబ్బందిగా మారడంతో కొన్ని చోట్ల రోడ్లపై బడ్డీలు తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా ఎదుట ఉన్న మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వాహనాలను అధికారులు తొలగించారు. జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ అధికారులు వీటి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. అలాగే కొందరి వ్యాపారుల గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రోడ్డులో వ్యాపార లావాదేవీలు సాగించవద్దని పలుమార్లు హెచ్చరించినా వారు వినిపించుకోకపోవడంతో సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పొదుపు సంఘాల ప్రతినిధులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న పుర్రె సురేష్‌యాదవ్



చీరలు పంపిణీ చేస్తున్న శ్రీను, ప్రసాద్ రెడ్డి

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం పలు వార్డుల డ్వాక్రా సంఘాల ప్రతినిధులకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ తదితరులు చీరలు పంపిణీ చేశారు. అలాగే 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ తన వార్డు పరిధి డ్వాక్రా ప్రతినిధులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు, నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి, మంగ పాల్గొన్నారు.

90వ వార్డులో..

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని మహిళలకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నమ్మి శ్రీను, ప్రసాద్ రెడ్డి గురువారం చీరలు పంపిణీ చేశారు. అక్క చెల్లెమ్మలకు దసరా సందర్భంగా వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ పండుగ కానుక రూపంలో చీరలను అందజేశారు. వీటిని మహిళందరికీ అందజేయాలనే ఆయన కోరిక మేరకు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా నమ్మి శ్రీను, ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు మేలు చేయాలనే సంకల్పంతో ఆడారి ఆనంద్ కుమార్ అనేక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో వార్డు పరిధిలో అన్ని కాలనీల్లో మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా దృష్టి సారించామన్నారు

89వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో దసరా సంబరాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు తదితరులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సమకూర్చిన చీరలను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ రహ్మాన్, దాడి ఆదిబాబు, వలంటీర్లు, ఆర్‌పీలు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ ఊరేగింపు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తోన్న కాలనీ వాసులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు విమాన్ నగర్ రెసిడెన్షియల్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ వారి అనుపమహోత్సవం బుధవారం రాత్రి కోలాహలంగా జరిగింది. నవరాత్రుల పాటు పూజలందుకున్న అమ్మవారి విగ్రహంను భక్తుల జేజేలు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. భవనీ మాలధారణ చేసిన భక్తులు వేడుకలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాలనీ అసోసియేషన్ కార్యదర్శి పీ నాగు ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జిల్లా యోగా అసోసియేషన్, ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు-2023 జరగనున్నాయి. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం ఏయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.రాజు, కార్యదర్శి సిహెచ్.వెంకటరమేష్, కోశాధికారి జి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తు లు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పూజలలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

మూతపడిన గృహ నిర్మిత కేంద్రం



పైనాపిల్ కాలనీ వద్ద తెరుచుకోని గృహ నిర్మిత కేంద్రం



కేంద్రం బోర్డు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ గృహ నిర్మాణ నిర్మిత కేంద్రం మూతపడింది. ఒకప్పుడు నిత్యం సందడిగా ఉండే ఈ కేంద్రం ఇప్పుడు పిచ్చి మొక్కలు, ముళ్ల పొదళ్ల మధ్య దర్శనమిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ సుమారు 25 ఏళ్ల క్రితం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నాణ్యమైన సిమెంట్ ఇటుకలు ఉత్పత్తి చేసేవారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయిన ఇటుకలను ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే నిర్మాణాల కోసం వినియోగించేవారు. నగరంతో పాటు జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర భవనాలు ఎక్కడ నిర్మాణం జరిగినా ఇక్కడి ఇటుకలనే సరఫరా చేసేవారు. ఇటుకలు నాణ్యమైనవి కావడంతో ప్రైవేట్ వ్యక్తులు గృహ నిర్మాణం కోసం కూడా కొనుగోలు చేసేవారు. వాటి కోసం ముందుగా వచ్చి ఇండెంట్ పెట్టుకునేవారు. వచ్చే ఇండెంట్ల ప్రకారం ఇటుకలను తయారు చేసేవారు. ఇలా ఇటుకలను తీసుకెళ్లడానికి వచ్చే వాహనాలతో ఇక్కడ రోజూ సందడిగా ఉండేది. ప్రస్తుతం ఇది మూతపడింది. సుమారు మూడేళ్లుగా ఇక్కడ సిమెంట్ ఇటుకలు ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. ఈ కేంద్రం బోర్డు సైతం చెట్ల కొమ్మల చాటున కనిపించడంలేదు. అధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తే చాలా మందికి ఉపాధి లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

జగదాంబ : ధర్మ పరిరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేవస్థానాల్లో ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తుందని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. వార్డులోని పూర్ణామార్కెట్ జంక్షన్‌లో గల దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం జరిగిన నృత్య ప్రదర్శనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. అనంతరం లలిత సంగీతం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, దేవస్థానం ఈవో శేఖర్‌బాబు, చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కాండ్రేగుల రూపవతి, యాళ్ల రమణమ్మ, పిల్లి వెంకటరమణ, అర్చక ధర్మకర్త రాంబాబు, 35వ వార్డు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్



వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

అల్లిపురం : విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలు బంద్ ప్రకటించినట్లు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఉల్లం నాగరాజు, కార్యదర్శి వై. రాంబాబు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నవంబర్ 8వ తేదీకి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బందులో పాల్గొనాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు, పీడీఎస్ఎఫ్ జిల్లా నాయకురాలు అభిశ్రీ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రతన్‌కాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శేఖర్, జీవన్, మనీ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.